క్లుప్తంగా

రేపు ధనలక్ష్మీ పూజ

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో బుధవారం దీపావళి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. వేకువజామున అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలతో పాటు ప్రత్యేక అలంకరణ చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే రాత్రి 7.30 గంటలకు ధనలక్ష్మీ పూజ ఉంటుందని భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

పోరుమామిళ్లలో...

పోరుమామిళ్ల: పట్టణంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో రేపు (గురువారం) సాయంత్రం దీపావళి సందర్భంగా శ్రీ ధనలక్ష్మీ పూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు చాటకొండు సుబ్రమణ్యం(రత్న), జనార్ధనశెట్టి తెలిపారు. దీపావళి పర్వదిన సందర్భంగా ఏర్పాటు చేస్తున్న ధనలక్ష్మీ పూజలో భక్తులు పాల్గొని అమ్మవారి అనుగ్రహం పొందాలన్నారు. పూజ అనంతరం అమ్మవార్లకు, స్వామికి దసరా బ్రహ్మోత్సవాల్లో అలంకరించిన చీరలు, ధనలక్ష్మి ధరించిన చీరను వేలం వేస్తామన్నారు.

ఘనంగా ధ్వనంతరి జయంతి



ధన్వంతరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న డాక్టర్, సిబ్బంది

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక జిల్లా ఆస్పత్రిలోని ఆయుర్వేద వైద్యశాలలో మంగళవారం ధన్వంతరి జయంతి సందర్భంగా జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని నిర్వహించారు. ధన్వంతరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యురాలు అపర్ణ శ్రీరాం మాట్లాడుతూ ఆయుర్వేదం ఎంతో ప్రాచీన మైన గొప్పవైద్యమన్నారు. ఎలాంటి దుష్ప్రభావాలు లేకుండా వ్యాధులు నయం చేసుకోవచ్చన్నారు. మంచి ఆహార అలవాట్లను అలవాట్లను పెంపొందించుకోవాలని సూచించారు. అవోపాలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించనట్లు తెలిపారు. యునానివైద్యుడు నిరంజన్ నాయక్, హోమియో కాంపౌండర్ మహేశ్వరయ్య, ఎంఎస్ఓ రమణ, రిటైర్డ్ కాంపౌండర్ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

బద్వేలు అర్బన్: స్థానిక ఎన్‌జీఓ కాలనీలోని మున్సిపల్ కార్యాలయంలో ఉన్న సమావేశ హాలులో బుధవారం ఉదయం 10:30 గంటలకు మున్సిపల్ చైర్మన్ వి.రాజగోపాల్‌రెడ్డి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మున్సిపల్ వైస్ చైర్మన్లు, అన్ని వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

సమాజం పట్ల బాలికలకు అవగాహన ఉండాలి

బద్వేలు అర్బన్: ప్రస్తుత కాలంలో జరుగుతున్న అనేక ఘటనలను దృష్టిలో ఉంచుకుని బాలికలు సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని దళితవేదిక రాష్ట్ర అధ్యక్షులు రెడ్డెయ్య, అంబేద్కర్ ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎం.పిచ్చయ్యలు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ విద్యార్థినులు చదువు పట్ల ఆసక్తి కలిగి ఉండి మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలు సాధిస్తే సమాజంలో తమకంటూ ప్రత్యేక స్థానం ఉంటుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి, దళితవేదిక పట్టణ అధ్యక్షులు కేశవయ్య, సీనియర్ దళిత నాయకులు జకరయ్య, నారాయణ, ఎస్టీఎం, తెలుగు అధ్యాపకులు సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువత కీలక పాత్ర పోషించాలి

ఖాజీపేట: అవినీతి నిర్మూలన కోసం యువత కీలక పాత్ర పోషించాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ శ్వేత అన్నారు. అవినీతి నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవినీతి నిర్మూలనలో యువత పాలుపంచుకుంటే అర్హులకు న్యాయం జరుగుతుందన్నారు. జిల్లా యువజన శాఖ అధికారి మణికంఠ మాట్లాడుతూ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేస్తే అర్హులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం నవీన్‌కుమార్, విజయ్‌కుమార్, మాలకొండయ్య, నరేష్ పాల్గొన్నారు.

పోస్టల్ సేవలు వినియోగించుకోవాలి

దువ్వూరు (చాపాడు): ఖాతాదారులు పోస్టల్ సేవలను వినియోగించుకోవాలని, ప్రజల కోసం పలు రకాలైన ప్రయోజనాలు కల్పించడం జరుగుతోందని కర్నూలు రీజియన్ అసిస్టెంటు డైరెక్టర్ బీపీ వెంకటరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన దువ్వూరులోని తపాలా సబ్ పోస్టాఫీసును మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పోస్టాఫీసు ద్వారా ప్రజలు పొదుపు ఖాతాలు, ఇన్సూరెన్స్ పాలసీలు, పోస్టల్ బ్యాంకు సేవలు వంటి సౌకర్యాలను వినియోగించుకోవాలన్నారు.

జ్వరం.. కలవరం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ హనీఫ్‌బాబా



జిల్లా ఆస్పత్రిలో రక్త పరీక్ష కోసం నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

- ఇంటింటా జ్వరపీడితులే..
- జ్వరాలతో కిక్కిరిసిన ఆస్పత్రులు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

ప్రొద్దుటూరు క్రైం : జ్వరాల తీవ్రత రోజు రోజుకు పెరుగుతోంది. ఏ ఇంట చూసినా జ్వర పీడితులు కనిపిస్తున్నారు. జ్వరంతో పాటు దగ్గు, జలుబు, గొంతునొప్పి ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు సంక్రమణ ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. చిన్నారులు, వృద్ధుల్లో జ్వరాల తీవ్రత ఎక్కువగా కనిపిస్తోంది. జ్వర పీడితులతో జిల్లా ఆస్పత్రితో పాటు ప్రొద్దుటూరులోని ప్రైవేట్ ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. జిల్లాలో కడప రిమ్స్, పులివెందుల మెడికల్ కాలేజీ, ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రులతో పాటు 50 పీహెచ్‌సీలు, 30 అర్బన్ హెల్త్ సెంటర్లు, 8 సీహెచ్‌సీలు ఉన్నాయి. ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి ప్రొద్దుటూరుతో పాటు జమ్మలమడుగు, మైదుకూరు, కమలాపురం, నంద్యాల జిల్లాల నుంచి వైద్యం కోసం వందలాది మంది వస్తుంటారు. జిల్లా ఆస్పత్రిలో రోజు 900–1100 పైగా ఓపీ నమోదు అవుతుంది. వీటిలో 400 పైగా జ్వరం, జలుబు, శ్వాస సంబంధిత కేసులు వస్తున్నాయి. ఈ కేసులను పరీక్షించగా సీజనల్ ప్రభావిత జ్వరాలు, ఇతర శ్వాసకోశ వ్యాధుల వ్యాప్తి చెందుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. జ్వర పీడితులతో ప్రైవేట్ ల్యాబ్‌లు కిక్కిరిసిపోతున్నాయి. వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసమే ప్రజలు రూ. వేలకు వేలు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. వ్యాధి తీవ్రత పెరగడంతో కొన్ని రోజుల తర్వాత కొందరిలో న్యూమోనియాగా మారి శ్వాసకోస ఇబ్బందులకు దారి తీస్తోంది.

వైరల్ ఫీవర్ లక్షణాలు:

వైరల్ ఫీవర్ బారిన పడిన వారిలో ఎక్కువగా తీవ్రమైన దగ్గు, జలుబు, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులు లక్షణాలు కనిపిస్తాయి. కొందరిలో అధిక జ్వరం వస్తుంది. మరికొందరిలో శ్వాససంబంధమైన సమస్యలకు ఈ వైరస్ కారణమవుతోంది. జబ్బు చేసిన వారు బయట తిరగకుండా ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. వైద్యులను సంప్రదించుకుండా ఇష్టానుసారంగా మందులను వాడొద్దని చెబుతున్నారు.

కనీస జాగ్రత్తలు తీసుకుంటే నో టెన్షన్ :

వ్యాధి సోకినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటే సీజనల్ వ్యాధుల నుంచి ఉపశమనం పొందవచ్చని వైద్యులు అంటున్నారు.

- జ్వరం లక్షణాలు ఉన్నవాళ్లు ఇతరులకు దూరంగా ఉండాలి. కరచాలనం, ఆలింగనం చేయరాదు. కలిసి భోజనం చేయరాదు.
- లక్షణాలున్న వారు బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేయరాదు.
- సొంత వైద్యం చేసుకోవడం మానేసి వైద్యుడి సూచనల మేరకు మందులను వాడాలి.
- బహిరంగ ప్రదేశాలు, జనంలో ఉన్నప్పుడు విధిగా మాస్క్‌ను ధరించాలి.
- తరచూ చేతులను శుభ్రం చేసుకోవాలి.
- నోరు, ముక్కును పదే పదే చేతులతో తాకరాదు.
- దగ్గుతున్నప్పుడు చేతి రుమాలు ఉపయోగించాలి.
- వ్యాధి నిరోధక శక్తి పెంచే ఆహారం తీసుకోవాలి.

గ్రామాల్లో పారిశుధ్య చర్యలు

గ్రామాల్లోనూ సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. పీహెచ్‌సీలకు వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోంది. వైరల్ జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో కల్లూరు, కామనూరు, రాజుపాళెం మండలంలో పీహెచ్‌సీలు ఉన్నాయి. ఈ ఆస్పత్రులకు రోజుకు 250 మందికి పైగా ఓపీలో చికిత్స చేయించుకుంటారు. సీజనల్ వ్యాధులు ప్రబలడంతో ఓపీ పెరిగినట్లు కామనూరు పీహెచ్‌సీ డాక్టర్ హనీఫ్‌బాబా తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి



సీజనల్ వ్యాధులు ఎక్కువగా సోకుతున్నాయి. జ్వరం, జలుబు, గొంతు నొప్పి, ఒళ్లు నొప్పుల కేసులు అధికంగా వస్తున్నాయి. వైరస్ వ్యాప్తి కారణంగా ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ఇలాంటి సమయంలో ప్రజలు తగుజాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిలో ఈ వైరస్ న్యూమోనియోగా మారే అవకాశం ఉంది.

– డాక్టర్ మహాలక్ష్మి, కల్లూరు పీహెచ్‌సీ

భయపడాల్సిన పనిలేదు



జ్వరపీడితులు వైద్యులను సంప్రదించి మందులు వాడితే త్వరగా నయం అవుతుంది. వారం నుంచి 10 రోజుల్లోపు లక్షణాలు తగ్గుతాయి. జ్వరం తగ్గలేదని మెడికల్ షాపులను ఆశ్రయించరాదు. యాంటిబయాటిక్స్ వాడొద్దు. జిల్లా ఆస్పత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్ ఆనంద్‌బాబు, జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్, ప్రొద్దుటూరు

చీడపీడలపై అవగాహన ఉండాలి



గోపవరం: ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ



మైదుకూరు: జీవామృతం తయారీని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు

కాశినాయన: రైతులు చీడపీడలపై అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి జయలక్ష్మి, ఉద్యాన అధికారి శ్రీనివాసులరెడ్డిలు తెలిపారు. మంగళవారం మండలంలోని ఇటుగుల్లపాడు రైతుసేవా కేంద్రం పరిధిలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా రైతులు సాగు చేసిన వరి, మినుము, కంది, అరటి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరిలో కాండం తొలుచు పురుగును గమనించి నివారణకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీఏఓ మహేష్, ఏఈఓ ధనలక్ష్మి, ఎంపీఈఓ శశికళ, రైతులు పాల్గొన్నారు.

జీవన ఎరువులను వినియోగించాలి

మైదుకూరు: పంటల సాగులో జీవన ఎరువులను వినియోగించాలని వ్యవసాయశాఖ మైదుకూరు ఏడీ కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లె రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ జీవన ఎరువుల వల్ల భూమి ఆరోగ్యవంతంగా తయారవుతుందన్నారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.బాలకృష్ణ, శ్రీవిద్యారాణి, ఫిరోజ్ హుస్సేన్, మండల వ్యవసాయాధికారి పి.ప్రసన్న మాట్లాడుతూ జీవన ఎరువుల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం రైతులతో జీవామృతాన్ని తయారు చేయించారు.

చెన్నవరంలో పొలం పిలుస్తుంది

గోపవరం: మండలంలోని రాచాయపేట రైతుభరోసా కేంద్రంలోని చెన్నవరం గ్రామంలో బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు సాగుచేసిన వరిపంటను పరిశీలించి కాండం తొలుచు పురుగు, ఉల్లికోడు ఉన్నట్లు గమనించడం జరిగిందని, నివారణ కోసం టిప్రోనీల్ గుళికలు ఎకరాకు 8 కిలోలు వాడాలని రైతులకు సూచించారు. వ్యవసాయ సిబ్బంది ఓబయ్య, సుబ్బయ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రంగసముద్రంలో..

పోరుమామిళ్ల: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా వనరుల కేంద్రం అధికారి శైలజ, వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త సునీల్ రంగసముద్రం సందర్శించారు. గ్రామంలో రైతులు సాగు చేస్తున్న వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. వరి, మొక్కజొన్న పంటలను ఆశించే చీడపీడల గురించి, తెగుళ్ల గురించి రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారి వరహరి కుమార్, బీటీయం శ్రీనివాసులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

చాపాడు: వరి పంటలో దోమ, ఆకుముడత తెగుళ్లతో రైతులు అప్రమత్తంగా ఉంటూ పంటను కాపాడుకోవాలని మండల వ్యవసాయాధికారి మ్యాగీ అన్నారు. మండలంలోని అన్నవరం, మదూరు గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

రక్తదానం వెలకట్టలేనిది



రక్తదానం చేస్తున్న రూరల్ శివశంకర్‌ను అభినందిస్తున్న డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్

మైదుకూరు: రక్తదానం వెలకట్టలేనిదని మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మైదుకూరు ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో డీఎస్పీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం పునర్జన్మ ఇస్తుందని తెలిపారు. రక్తదానం ఎంతో విలువైనదని రక్తం ఇచ్చేవారు ప్రాణదాతలుగా మిగిలిపోతారని అన్నారు. రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తం ఇచ్చిన మైదుకూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని సిబ్బందికి, స్వచ్ఛందంగా రక్తదానం చేసిన వారికి ఆయన అభినందించారు. కడప రిమ్స్ రక్త విభాగం వారు అందజేసిన సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.

గిరిజనులకు 'న్యాయ విజ్ఞానం'



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్

మైదుకూరు: గిరిజనులకు చట్టాల గురించి అవగాహన కల్పించేందుకు, న్యాయ విజ్ఞానం అందించేందుకు న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేసినట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్ అన్నారు. మంగళవారం మండలంలోని గంజికుంట సుగాలి తాండాలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి బాబా ఫకృద్దీన్ మాట్లాడుతూ రాష్ట్ర న్యాయ సేవా అధికారి సంస్థ ఆదేశానుసారంతో రోడ్డు ఉండి, రవాణా సౌకర్యం లేని గిరిజన ప్రాంతాలను, కొండ ప్రాంతాలు, పల్లెలు, గ్రామాలను గుర్తించి వారికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించేందుకు న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. గిరిజనుల సమస్యలను తెలుసుకునే విధంగా టీం సభ్యులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి వారి సహకారంతో మైదుకూరు మండలంలోని గంజికుంట తండాను ఎంచుకున్నట్లు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు గురించి, ఉచిత న్యాయ సహాయం, లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నంబర్ 15,100, నల్సా పథకాల గురించి, లీగల్ ఎయిడె డిఫెన్స్ కౌన్సిల్ గురించి, జాతీయ లోక్ అదాలత్ గురించి, గౌరవ జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ (గిరిజన హక్కుల రక్షణ మరియు అమలు) పథకం 2015, గిరిజనుల పరిరక్షణకై కొన్ని ముఖ్యమైన చట్టాలు అయిన షెడ్యూల్ తెగలు, కులాలు, ఇతర సంప్రదాయ అటవీ నివాసులు (అటవీ హక్కుల గుర్తింపు) చట్టం 2006, షెడ్యూల్ కులాలు, షెడ్యుల్ తెగల (దురాగతాలు నిరోధక) చట్టం 1989, నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009, భూమి స్వాధీనం చేసుకునేందుకు పునరావాసం, పునరావాసం కల్పనలో సరైన పరిహారం, పారదర్శకత హక్కు 2013, పంచాయతీల (షెడ్యూల్ ప్రాంతాలకు పొడిగింపు చట్టం) 1996, రాజ్యాంగంలోని ఐదు, ఆరవ షెడ్యూల్, ఎన్‌డీపీఎస్ చట్టం, అటవీ చట్టం, వితంతు పింఛన్లు, దివ్యాంగుల పింఛన్లు, ఆధార్, రేషన్ కార్డు, ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. అనంతరం లీగల్ సర్వీసెస్‌కు సంబంధించిన పథకాలను సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. తాండ వాసులు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, హెల్త్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తదితర సర్టిఫికెట్లకు ఏవైనా సందేహాలు ఉన్నా, అప్లై చేసి అవి రాకపోయినా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను లేక దగ్గరలోని మండల న్యాయ సేవా సమితులను సంప్రదించాలని సూచించారు.

వైద్య శిబిరం

జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో సుగాలి తండాలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తాండా వాసులకు బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ సరస్వతి, అసిస్టెంట్ ట్రైబల్ ఆఫీసర్ సురేష్, మైదుకూరు తహసీల్దార్ రాజసింహా నరేంద్ర, ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు, ఎంపీపీ థామస్, సర్పంచ్ జయభారత్ రెడ్డి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే లైసెన్స్ రద్దు



మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రమోహన్

బద్వేలు వ్యవసాయం: దీపావళి పండగను పురస్కరించుకుని బాణసంచా (పటాకుల)దుకాణాలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని బద్వేలు రెవెన్యూ డివిజినల్ అధికారి(ఆర్‌డీఓ) ఏ.చంద్రమోహన్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఆర్‌డీఓ కార్యాయలంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాణసంచా దుకాణదారులు నిబంధనలు అతిక్రమిస్తే పటాకులు అమ్మకానికి ఇచ్చిన అనుమతి పత్రాలు వెంటనే రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. డివిజన్ పరిధిలోని ఏడు మండలాలకు 91 లైసెన్స్‌లు మంజూరు చేశామని తెలిపారు. బద్వేల్ మండలానికి మంజూరైన దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి నూతన ఆర్‌డీఓ కార్యాలయ నిర్మాణ స్థలంలో, గోపవరం మండలానికి సంబంధిచిన దుకాణాలు పోరుమామిళ్ల బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇచ్చామని చెప్పారు. మిగిలిన మండలాల్లో ఆ మండలాలకు సంబంధించి తహసీల్దారు సూచించిన స్థలాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకుంటారన్నారు. దుకాణాల మధ్య మూడు మీటర్ల దూరం ఉండాలని ప్రతి దుకాణం దగ్గర రెండు డ్రమ్ముల నీళ్లు, రెండు బకెట్ల ఇసుక, అగ్నిమాపక పరికరాలు, అలాగే దుకాణాల చుట్టూ అగ్నిమాపక యంత్రం తిరిగేందుకు ఆరు మీటర్ల దారి ఉండాలని తెలిపారు. టపాసులు అధిక రేట్లకు అమ్మినట్లేతే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆర్‌డీఓ కార్యా లయ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలను తప్పక పాటించాలి

బద్వేలు అర్బన్: టపాసుల దుకాణదారులు నిర్దేశించిన నిబంధనలను తప్పక పాటించాలని ఆర్డీఓ చంద్రమోహన్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాత్కాలిక లైసెన్స్ పొందిన వ్యాపారస్తులు మాత్రమే టపాసుల దుకాణాలు నిర్వహించాలని, అలాగే ప్రతి దుకాణానికి మధ్యలో మూడు మీటర్ల దూరం ఉండేలా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దుకాణాల వద్ద అగ్నిప్రమాద నిరోధక యంత్రాలతోపాటు డ్రమ్ముల్లో నీటిని, ఇసుకను అందుబాటులో ఉంచాలని కోరారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు చేయడంతో పాటు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

కార్తీక మాసంలో ప్రత్యేక బస్సులు

మైదుకూరు: కార్తీక మాసంలో మైదుకూరు ఆర్టీసీ డిపో నుంచి శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శ్రీరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని పంచారామాలైన అమరావతి, సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరం క్షేత్రాలకు సూపర్ లగ్జరీ బస్సులను నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ పేర్కొన్నారు. అదేవిధంగా మహానంది, ఓంకారం, శ్రీశైలం క్షేత్రాలను ప్రతి ఆదివారం ఉదయం ఎక్స్‌ప్రెస్ సర్వీసులను నడుపుతామని తెలిపారు. అరుణాచల క్షేత్రానికి ప్రతి సోమవారం స్వామివారిని దర్శించుకునే విధంగా మందు రోజు ఆదివారం బస్సులను నడుపుతామని పేర్కొన్నారు. వివరాలకు 7382866498, 7382866640, 7382865848 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్యే నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్: పట్టణంలోని రాజుగారివీధికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, మాజీ వార్డు మెంబర్ అన్వర్‌బాషా అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ అన్వర్‌బాషా మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీపరంగా అన్నిరకాలుగా అండగా ఉంటామని తెలియజేయడంతోపాటు కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జిలు బిజ్జం రమణ, ఆవుల శ్రీను, రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

ఖాజీపేట: శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో దొంగలు హుండీ పగుల కొట్టి చోరీకి పాల్పడ్డారు. ఖాజీపేట మండలం ఆంజనేయకొట్టాలు గ్రామంలో శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో హుండీని సోమవారం రాత్రి దొంగలు పగుల కొట్టారు. హుండీలో భక్తులు వేసిన కానుకలను చోరీ చేశారు. వీటితో పాటు వెండి వస్తువులు కూడా చోరీకి గురైనట్లు ఆలయ పూజారి తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు



మైదుకూరు: స్వచ్ఛ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, అధ్యాపకులు

ప్రొద్దుటూరు: మన చుట్టు ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. మంగళవారం స్థానిక కూరగాయల మార్కెట్‌లో భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు మై భారత్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా దీవాలి విత్ మై భారత్‌లో భాగంగా వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలిపారు. అనంతరం వెంకటేశ్వర డిగ్రీ కాలేజీ, రాణి తిరుమల దేవి డిగ్రీ కాలేజీ, వేదవ్యాస డిగ్రీ కాలేజీ విద్యార్థులతో కలసి కూరగాయల మార్కెట్ పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో సంస్కృతి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి, డాక్టర్లు నరసింహారెడ్డి, వరుణ్‌కుమార్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు, విజయ్‌కుమార్‌రెడ్డి, వెంకటేశ్వర డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ అర్కటవేముల హరినారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గౌరీశంకర్, రాణితిరుమల దేవి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మైదుకూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని నెహ్రూ యువ కేంద్రం అధికారి మణికంఠ పేర్కొన్నారు. మైదుకూరులో మంగళవారం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, అమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో కూరగాయల మార్కెట్ ప్రాంతంలో స్వచ్ఛ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బాల శివ మహారాజ్ డిగ్రీ కళాశాలకు చెందిన 120 మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కూరగాయల మార్కెట్ ప్రాంతాన్ని శుభ్రం చేశారు.

పంచాయతీ నిధులు దుర్వినియోగంపై విచారణ



బద్రిపల్లె గ్రామ సచివాలయంలో నిధులు దుర్వినియోగంపై విచారిస్తున్న డీఎల్పీఓలు

చాపాడు: మండల పరిధిలోని బద్రిపల్లె గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగంపై మంగళవారం కడప, జమ్మలమడుగు డీఎల్పీఓలు విజయభాస్కర్, తిమ్మక్క విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా విచారణ అనంతరం వారు మాట్లాడుతూ ఎంపీడీఓ కార్యాలయంలో ప్రైవేటు కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న హనీఫ్ బాషా బద్రిపల్లె గ్రామ పంచాయతీ నిధులను తన చేతివాటం ప్రదర్శించి రూ.2.50 లక్షలు తనకు అనుకూలమైన వారి ఖాతాకు బదిలీ చేసుకున్నాడని తెలిపారు. గ్రామ సర్పంచ్ గుత్తి మల్లేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకూ పోలీసులు నమోదు చేశారన్నారు. మంగళవారం ఈ సంఘటనపై విచారణ చేపట్టామన్నారు. స్వాహా చేసిన సొమ్మును రూ.20 రోజుల్లో చెల్లిస్తామని ఒప్పంద పత్రం రాయించుకున్నామని తెలిపారు. కంప్యూటర్ ఆపరేటర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఘటనపై పూర్తి నివేదికను డీపీఓకు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, సర్పంచ్ భర్త నారాయణ యాదవ్, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తొలి రోజు నుంచే ఎగ్జిబిషన్‌లో ధరలు పెంచారు

- కుక్కల శస్త్ర చికిత్స కోసం రూ.23 లక్షలు అవసరం
- ఎవరు స్థలాలు ఆక్రమించినా చర్యలు తీసుకోవాల్సిందే
- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సభ్యులు



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి



కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి

ప్రొద్దుటూరు: దసరా సందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో తొలి రోజు నుంచే టికెట్ల ధరలను పెంచి మున్సిపల్ గెజిట్‌కు విలువలేకుండా చేశారని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షత మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా బంగారు మునిరెడ్డి మాట్లాడుతూ ఎగ్జిబిషన్ ప్రవేశానికి పిల్లలకు రూ.15, పెద్దలకు రూ.25, ఎగ్జిబిషన్‌లో ఆటవస్తువులకు రూ.80 చొప్పున వసూలు చేయాలని ప్రత్యేకంగా మున్సిపల్ సమావేశంలో గెజిట్‌కు ఆమోదం తెలపడం జరిగిందన్నారు. ఎగ్జిబిషన్ ప్రారంభం రోజు నుంచే కాంట్రాక్టర్ అదనంగా డబ్బు వసూలు చేశాడని, దసరా రోజున ప్రవేశ రుసుం రూ.100 చొప్పున వసూలు చేశారన్నారు. ఇదే టికెట్‌లకు కౌన్సిల్‌లో ఆమోదం తెలిపింటే మున్సిపాలిటీకి ఆదాయం వచ్చేదన్నారు. అదనపు వసూళ్ల ద్వారా కాంట్రాక్టర్ రూ.5 కోట్ల నుంచి రూ.6 కోట్లు లబ్ధి పొందారన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎగ్జిబిషన్ కాంట్రాక్టర్ వేలం పాటకు సంబంధించి రూ.కోటి 50 లక్షలు చెల్లించాడని, జీఎస్టీతో కలిపి ఇంకో రూ.55 లక్షలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. మున్సిపల్ పార్కులో నైట్ వాచ్‌మెన్ లేక దొంగతనాలు జరుగుతున్నాయని, వెంటనే సిబ్బందిని నియమించాలని వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా తెలిపారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ స్థలాలతోపాటు ప్రభుత్వ స్థలాలను, భవనాలను ఎవరు ఆక్రమించినా సహించేది లేదని, తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను ఆదేశించారు. ఈ ఏడాది మార్చి నుంచి పనిచేస్తున్న ముగ్గురు ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఇంత వరకు వేతనాలను మంజూరు చేయలేదని కౌన్సిలర్ కొవ్వూరు స్వాతి తెలపగా, ప్రస్తుత అజెండాలో ఈ అంశాన్ని చేర్చినట్టు కమిషనర్ తెలిపారు. పట్టణ పరిధిలో రీ సర్వే నిర్వహించగా 3,248 కుక్కలు ఉన్నాయని తేలినట్టు కమిషనర్ తెలిపారు. అందులో 1544 కుక్కలకు శస్త్రచికిత్స పూర్తి చేశారని, మిగలిన 1704 కుక్కల శస్త్రచికిత్సల కోసం రూ.23 లక్షలు అవసరమని కమిషనర్ తెలిపారు. ఒక్కొక్క కుక్కకు రూ.1347 చెల్లించాల్సి ఉంటుందన్నారు. త్వరగా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఎమ్మెల్యేతోపాటు సభ్యులు కోరారు. పట్టణంలో తరచూ వీధి లైట్లు పనిచేయడం లేదనే వార్తలు పత్రికల్లో ఎందుకు వస్తున్నాయని కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి ప్రశ్నించారు. మడూరు కాలువలో నాలుగు ట్రాక్టర్లు మాత్రమే పూడిక తొలగించారని కౌన్సిలర్ జంబాపురం వెంకటలక్ష్మి తెలిపారు. కౌన్సిలర్లు చెప్పే సమస్యలను వెంటనే పరిశీలించి పరిష్కారం చూపాలని, కౌన్సిలర్ల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.